క్లుప్తంగా

'కుటుంబమే ప్రథమ పాఠశాల'



లక్డీకాపూల్: కుటుంబమే ప్రథమ పాఠశాల అని శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం సతీష్ అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాల నుంచి నేర్చుకున్నది మాత్రమే కాకుండా కుటుంబం నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందన్నారు. బుధవారం గడ్డి అన్నారంలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిల్లీ గ్లోరీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయిగీత ఆధ్వర్యంలో విద్యార్థులు తమ తమ తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రేయోభిలాషి ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి.వి.రావు మాట్లాడుతూ... కుటుంబ విలువలు, బాధ్యతల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రవీణ్, ఆర్ఐ రవీందర్‌రెడ్డి, కో ఆర్డినేటర్లు రఘు వంశీ, జితేందర్, పాఠశాల డీన్ నరేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ సురేందర్ రెడ్డి, సీసీఏ ఇంచార్జ్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వంశీరెడ్డయ్య అంత్యక్రియలు పూర్తి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నర్సింహారెడ్డి నివాళి



వంశీరెడ్డియ్య (ఫైల్)

మన్సూరాబాద్: ఉన్నత విద్యను అభ్యసించేందుకు అమెరికాకు వెళ్లిన బోడగల వంశీరెడ్డయ్య (23) గత శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం వంశీరెడ్డయ్య భౌతికకాయం మన్సూరాబాద్‌లోని అతని నివాసానికి చేరుకుంది. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి తదితరులు వంశీరెడ్డయ్య భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆటోనగర్‌లోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

యువతి అదృశ్యం



విజయలక్ష్మి

హయత్‌నగర్: ఇంట్లో నిద్రపోయిన ఓ యువతి తెల్లవారేసరికి కనిపించకుండా పోయిన సంఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... హయత్‌నగర్ డివిజన్‌లోని రామకృష్ణ కాలనీకి చెందిన జంపల్లి గోపీరెడ్డి కూతురు విజయలక్ష్మి(21) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. మంగళవారం ఇంట్లో నిద్రపోయిన ఆమె బుధవారం తెల్లవారుఝామున చూడగా కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

భారీగా గంజాయి పట్టివేత?

హయత్‌నగర్: ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు కంటైనర్‌లో భారీ స్థాయిలో తరలిస్తున్న గంజాయిని బుధవారం ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు కంటైనర్ లారీలో పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు హయత్‌నగర్ వద్ద వల పన్ని పట్టుకున్నారు. కంటైనర్‌లో వేల కిలోల గంజాయి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిని పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ధ్రువీకరించక పోవడంతో గందరగోళం నెలకొంది.



హాల్ టిక్కెట్ నెంబర్లను సరిచూసుకుంటున్న విద్యార్థులు



తనిఖీ చేస్తున్న కాలేజీ సిబ్బంది

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా కనిపించాయి. విద్యార్థులు ఆయా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. పరీక్ష ప్రారంభం అయ్యేందుకు 30 నిమిషాల ముందే కేంద్రంలోకి విద్యార్థులకు అనుమతిచ్చారు.

– మన్సూరాబాద్



నాగోలు రాక్‌టౌన్‌కాలనీలోని శ్రీనాగార్జున జూనియర్ కాలేజీ కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయండి

- మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల
- నియోజకవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులకు సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపై బుధవారం కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి అధికారులు, శానిటేషన్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులపై దృష్టిసారించి వాటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో కొత్తపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు సత్వరమే పరిష్కారం చేయాలన్నారు. నిర్లక్ష వైఖరి విడనాడాలని సూచించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

వేసవి ముంచుకొస్తున్నందున తాగునీటి ఇబ్బందులు, కరెంట్ సమస్యలు లేకుండా అప్రమతంగా ఉండాలని ఆయన సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు సయ్యద్ మినాజుద్దీన్, సలామ్ షాహిద్, సౌత్‌జోన్ జడ్‌సీ సామ్రాట్ అశోక్‌కుమార్, జలమండలి జీఎం హన్మంత్‌రెడ్డి, డీజీఎం షీలారాణి, జీహెచ్ఎంసీ ఈఈ రాధిక, డీఈ ప్రదీప్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయాలను తొలగిస్తే సహించం: వంగా



అధికారులతో మాట్లాడుతున్న వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: షాపింగ్ మాల్స్, ఇతర నిర్మాణాలకు అడ్డుగా ఉన్నాయనే సాకుతో ఆలయాలను తొలగించాలని చూస్తే సహించేది లేదని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం బైరామల్‌గూడ చెరువు సమీపంలోని కట్ట మైసమ్మ ఆలయాన్ని సర్కిల్ అధికారులు తొలగించిన విషయాన్ని తెలుసుకున్న మధుసూదన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ముందస్తు పరిసర కాలనీవాసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కనుసైగల్లో ఆలయాలను ఇష్టారీతిగా సర్కిల్ అధికారులు తొగిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎల్‌బీనగర్ చౌరాస్తాలోని ఆరె మైసమ్మ, ఎస్సీ కులస్తుల ఆలయాల తొలగింపులను అడ్డుకున్నట్లు గుర్తుచేశారు. తాను ఏ పార్టీలో ఉన్నా హిందూ ధర్మ పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆలయాల తొలగిపు విషయం ముందుగా తమ దృష్టికి తీసుకొస్తే అవసరమైతే ఆలయాన్ని శాస్త్రోక్తంగా తగు చర్యలు తీసుకొని తొగిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దశరథగౌడ్, సందీప్‌రెడ్డి, అమిత్, సుమిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచాలి

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎస్‌ఎన్‌డీపీ పనుల్లో వేగం పెంచి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం లింగోజిగూడ డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీలో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులను లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలసి ఎమ్మెల్యే శ్రీనివాసనగర్ పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... పది రోజుల క్రితం ఎస్‌ఎన్‌డీపీ అధికారులచే సమావేశం ఏర్పాటు చేసి పనుల్లో వేగం పెంచాలని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చంద్ర గార్డెన్స్ నుంచి ఉదయ్ నగర్ కాలనీ మీదుగా ఒక ప్యాకేజీ, వంగ శంకరమ్మ నుంచి పద్మానగర్ కాలనీ మీదుగా ఒక ప్యాకేజీ పనులు చేస్తామన్నారు. పనుల్లో వేగం పెంచి వచ్చే మే వరకు పూర్తి స్థాయిలో పనులు చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు గతంలో తెలిపామన్నారు. పనుల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ చర్యలు పాటిస్తూ పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్ రెడ్డి, నేతలు మధుసాగర్, ఆశిష్‌యాదవ్, అనిల్, రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



లింగోజిగూడలో ఎస్‌ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వేడుకగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మన్సూరాబాద్: విజయశ్రీకాలనీలోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అంరగంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. బుధవారం సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యావాహచనం, రక్షబంధనం, మృత్సంగ్రహణం, శేషవాహన సేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, హోమం, ధ్వజారోహణం కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. సమీప కాలనీల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

తల్లితో గొడవపడి కుమారుడి ఆత్మహత్య

హయత్‌నగర్: తల్లితో గొడవ పడిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వినాయకనగర్ కాలనీకి చెందిన జాలరి ఇందిర కొడుకు శ్రీకాంత్(25)కు భాగ్యలత వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఎడమ కాలు ఫ్రాక్చర్ కావడంతో ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. మూడు రోజల క్రితం తల్లితో గొడవ పడగా ఆమె చౌటుప్పల్‌లోని తన కూతరు ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శ్రీకాంత్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి స్నేహితుడు నవీన్ ద్వారా సమాచారం అందుకున్న తల్లి ఇంటికి వచ్చి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. చికిత్స నిమిత్తం శ్రీకాంత్‌ను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని పోలీసులు తెలిపారు.

దేశ సంపదను 'కార్పొరేట్'కు దోచిపెడుతున్న కేంద్రం



రాజ్‌భవన్ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి అనుకూలంగా క్రోనీ క్యాపిటలిజం విధానాన్ని అనుసరిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ రంగ సంస్థలను ధారాదత్తం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్స్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, చిక్కుళ్ల శివ ప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, తలాటి రమేష్ నేత, పెద్దవూర సైదులు, శివ, బొడ్డుపల్లి మహేందర్, కళ్యాణ్ యాదవ్, ప్రేమ్ నాయక్, పగడాల శ్రీశైలం, ఇస్మాయిల్, నగేష్ నేత, అనుదీప్, శ్రవణ్ కురుమ, టైగర్ శివ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తరలిన ఎల్‌బీనగర్ నేతలు...

చైతన్యపురి: అదానీ ఆర్థిక కుంభకోణంపై పార్లమెంటరీ కమిటీచే విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ సంపదను అదానీకి కట్టబెడుతోందని విమర్శించారు. గవర్నర్‌ను కలిసేందుకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయటం అక్రమమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

'కార్పొరేట్' కొమ్ముకాస్తున్న బీజేపీ: కాంగ్రెస్

మలక్‌పేట: కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్పొరేట్ శక్తుల కొమ్ముకాస్తున్నదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆరోపించారు. పారిశ్రామికవేత్త అదానీ షేర్ల కుంభకోణంపై విచారణ జరిపించాలని డిమాండ్‌చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి ఆయన ఆధ్వర్యంలో బుధవారం మలక్‌పేట నుంచి కార్యకర్తలతో పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ కుంభకోణంపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించక పోవడంలో ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. కుంభకోణంపై పార్లమెంటరీ కమిటీ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. దేశ సంపద కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ అవిశ్రాంత పోరాటం చేస్తుందన్నారు. నాయకులు సాయిరామ్, భాస్కర్, యాదిలాల్, రాజిరెడ్డి, శివ, కృష్ణ పాల్గొన్నారు.

మహనీయుడు కాన్షీరామ్

బహుజన రాజ్య పితామహుడికి ఘనంగా నివాళి

మన్సూరాబాద్: బహుజన రాజ్య పితామహుడు, బీఎస్పీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ జయంతిని ఎల్‌బీనగర్‌లో పలు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించారు. పూలే బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోలి నర్సింహా ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తాలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బహుజన సమాజాన్ని చైతన్య చేసి ఏకం చేసిన మహనీయుడు కాన్షీరాం అని కొనియాడారు. నాయకులు గాదేపాక యాదగిరి, రవి, చుక్క రమేష్, బొల్లుగి ముఖేష్, పాష, రాజేష్‌గౌడ్, వెంకటేష్‌యాదవ్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో బీఎస్పీ నేతలు...

ఎల్‌బీనగర్‌లో...

నాగోలు: బహుజన రాజకీయ వ్యూహకర్త కాన్షీరాం అని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండెల ధర్మేందర్ అన్నారు. బీఎస్పీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు గువ్వల సాయి రామకృష్ణ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో మహనీయుల విగ్రహాల వద్ద కాన్షీరాం జయంతిని నిర్వహించారు. కాన్షీరాం చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతలు వినయ్, ఇన్‌చార్జ్‌లు జక్క యాదగిరి, గిరి మహారాజు, జనిగే విష్ణువర్ధన్, బండారి రవికుమార్, రామకృష్ణ, మొలకలపల్లి కుమార్ పాల్గొన్నారు.



కామినేని చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నర్సింహా

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ నాయకులు విష్ణువర్ధన్, శివ, లింగస్వామి, రాములు, నర్సింహ, ప్రవీణ్, ఎల్లయ్య, మనోహర్, అరవింద్, శేఖర్ పాల్గొన్నారు.

